క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. ఎన్జీవోస్ కాలనీ -2, బాలసంతవాడ, ఎస్సీ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీ, ఫాతిమానగర్, భవానినగర్, ఇందిరానగర్, వడ్డెపల్లి, విజయ్‌పాల్ కాలనీ, టీచర్స్ కాలనీ, ఎక్సైజ్ కాలనీ, కనుకదుర్గ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వరంగల్‌లో..

వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. గొర్రెకుంట ప్రగతి ఇండస్ట్రీయల్ ప్రాంతం, కరీమాబాద్, శాంతినగర్, రామాలయం, లక్ష్మీనగర్, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఖిలా వరంగల్ రోడ్, పద్మశాలి వీధి, బెస్తం చెరువు, నక్కలపల్లి, అయ్యప్ప దేవాలయం, వ్యవసాయ కళాశాల, పోచమ్మమైదాన్ సర్కిల్, బొందలకుంట ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్రీమద్రామాయణ సప్తాహం

హన్మకొండ కల్చరల్: అయోధ్యలో బాలరామ మూర్తి ప్రతిష్ఠాపన కార్యక్రమం సందర్భంగా వరంగల్ ఏకశిల వైభవ మండలి ఆధ్వర్యంలో శనివారం నుంచి 26వ తేదీ వరకు శ్రీమద్రామాయణ సప్తాహం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు సాయంత్రం 6గంటలకు హనుమకొండ ఎన్జీవోస్ కాలనీరోడ్డులోని రెడ్డి మ్యారేజ్ హాల్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలతో ప్రవచనం, పారాయణం, భజన, సంకీర్తన మ్యూజిక్ అకాడమీ గురువు ఉమ్మడి లక్ష్మణాచార్య ఆధ్వర్యంలో భక్తి సంగీతం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం డాక్టర్ నందివాడ అనంతలక్ష్మితో సీతారాముల ఆదర్శ దాంపత్యం, 21న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డితో జాతి జీవనంలో రామాయణం, 22న డాక్టర్‌తో మైలవరపు శ్రీనివాసరావుతో భ్రాతృ ధర్మం - రామాయణం, 23న డాక్టర్ గంగ్ర లక్ష్మణరావుతో మానవ సంబంధాలు - రామాయణం, 24న ఆచార్య శ్రీమన్నారాయణమూర్తితో హనుమ ద్వైభవం, 25న అన్నదానం సుబ్రహ్మణ్యంతో మైత్రీ బంధం - రామాయణం, 26న సూర్యనారాయణ మూర్తితో రామపాదం నడచిన మార్గం అనే అంశాలపై ఆధ్యాత్మిక ప్రవచనాలు జరగనున్నాయని నిర్వాహకులు వివరించారు.

22న సెలవు ప్రకటించాలి

విద్యారణ్యపురి: ఈనెల 22న అయోధ్యలోని రామాలయంలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా సెలవు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) హనుమకొండ జిల్లా శాఖ బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని వీరస్వామి గౌడ్, ప్రధాన కార్యదర్శి మణికుంట్ల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు దాత మహర్షి, బాధ్యుడు రమేష్ పాల్గొన్నారు.

రాముడి అక్షింతల ఊరేగింపు



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రానికి చేరిన అయోధ్య రాముడి అక్షింతలకు అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో అక్షింతలను ఆలయ ప్రాంగణంలో ఉన్న 29 దేవతామూర్తుల ఎదుట ఉంచి పూజలు జరిపించారు. అనంతరం వాటిని ఊరేగిస్తూ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యకర్త అరుణ్‌కుమార్ రెడ్డి, ఆలయ మేనేజర్ ఎల్.రవి, పీఆర్వో మణిదీప్, ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి, శివకుమార్, సాయితేజ, శ్రీనివాస్, సీనమ్మ, పద్మ, హరిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిషేక పోస్టర్ల విడుదల



వరంగల్ చౌరస్తా: సీతారామచంద్ర కల్యాణం పట్టాభిషేకానికి సంబంధించిన పోస్టర్లను వరంగల్ చౌరస్తాలోని గీతా మందిర్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ నిర్వాహకులు సీఏ త్రిపురనేని గోపిచంద్, బండారు సాయి నారాయణ, మాదాపూర్ సదాశివుడు మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతిఒక్కరూ రామనామ స్మరణ చేయాలని సూచించారు.

హిందువుల ఆకాంక్ష నెరవేరబోతోంది



నయీంనగర్: ఆలయాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు



కాశిబుగ్గ కాశీ విశ్వేశ్వరాలయంలో..

నయీంనగర్: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో ఈనెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ మహా ఘట్టంతో ప్రపంచంలోని కోట్లాది మంది హిందువుల 500ఏళ్ల ఆకాంక్ష నెరవేరబోతోందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో భాగంగా డబ్బాల్ జంక్షన్ హనుమాన్ నగర్‌లోని దాసాంజనేయ స్వామి ఆలయంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుభ్రం చేసి, పరిసరాలోన్ని చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆలయాన్ని గురువారం శుభ్రం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కొలను సంతోష్‌రెడ్డి, దేశిని సదానందంగౌడ్, కొండి జితేందర్‌రెడ్డి, నాయకులు కందగట్ల సత్యనారాయణ, కె.సదానందం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో 'స్వచ్ఛ తీర్థ'

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో బీజేపీ నాయకులు గురువారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశంలోని అన్ని దేవాలయాల్లో స్వచ్ఛ తీర్థ అభియాన్ నిర్వహించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆలయాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాకం హరిశంకర్, గాడిపెల్లి రాజేశ్వరరావు, సిద్దం నరేష్, రత్నం కృష్ణ కిషోర్, కందిమల్ల మహేష్, కోమాకుల నాగరాజు, సతీష్ కట్టర్, తిరుపతిరెడ్డి, మంద శ్రీను, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకన్న

రామన్నపేట: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వాహనదారులను వరంగల్ ట్రాఫిక్ సీఐ వెంకన్న హెచ్చరించారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆదేశాలు, ఏసీపీ భోజరాజు సూచనల మేరకు వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వెంకన్న మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకునే చర్యలకు ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైల్వే క్రికెట్ పోటీలు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో జనరల్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఈమేరకు గురువారం మ్యాచ్‌ను రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ డీఈఈ అభిషేక్, రైల్వే చీఫ్ క్రూకంట్రోలర్ సాంబశివుడు టాస్‌వేసి ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో సీసీసీ లోకోపైలట్ జట్టు - మహబూబాబాద్ ఇంజనీరింగ్ జట్టు తలపడగా సీసీసీ జట్టు, రెండవ మ్యాచ్‌లో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ - వరంగల్ కింగ్స్ జట్లు పోటీపడగా ఆపరేటింగ్ ఫ్రెండ్స్ జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ రాజేశ్వర్, సభ్యులు రఘు, ప్రశాంత్, ఎస్.ప్రవీణ్, ఎం.మహేష్, సునీల్, ప్రశాంత్‌కుమార్, ఎం.రవికుమార్, రైల్వే జేఏసీ చైర్మన్ నర్సింగరావు పాల్గొన్నారు.



టాస్ వేస్తున్న రైల్వే డీఈఈ అభిషేక్

ఓటరుగా నమోదు చేసుకోవాలి



దరఖాస్తు ఫారాలను ఆవిష్కరిస్తున్న చిర్ర రాజు గౌడ్, తదితరులు

కేయూ క్యాంపస్: వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 2020, సెప్టెంబర్ 1వరకు డిగ్రీ పాసైన వారు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని టీజీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చిర్ర రాజుగౌడ్, కామర్స్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ మాదాసి కనకయ్య కోరారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దరఖాస్తు ఫారాలను వారు గురువారం విడుదల చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు ఫణీందర్, సునీత, మయూరి, సోమశేఖర్, శ్రీనివాస్, గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం

హసన్‌పర్తి: ఈనెల 20, 21వ తేదీల్లో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంప్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చల్లా ప్రసాద్ తెలిపారు. జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయా బూత్ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఓయూ విద్యార్థి నేతకు పరామర్శ

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓయూ విద్యార్థి నేత పెద్దమ్మ రమేష్‌ను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. హసన్‌పర్తిలోని రమేష్ స్వగృహానికి గురువారం వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు వీసం సురేందర్‌రెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, ముదిరాజ్ యూత్ అధ్యక్షుడు పెద్దమ్మ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, నాయకుడు బోడ యుగంధర్ తదితరులు ఉన్నారు.



పెద్దమ్మ రమేష్‌ను పరామర్శిస్తున్న అరూరి రమేష్

21న బాలరాముడి వేషధారణ పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మధు, సురేష్, తదితరులు

హన్మకొండ కల్చరల్: అయోధ్య బాలరాముడి ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని చిన్నారుల్లో రామ నామ చైతన్యం, శ్రీరాముడి గొప్ప గుణగణాలను అలవర్చుకోవాలనే సంకల్పంతో వరంగల్ మురుగన్ యాడ్స్ ఆధ్వర్యంలో వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వరంగల్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు మధు, సురేష్ తెలిపారు. వేషధారణ పోటీలకు సంబంధించిన పోస్టర్లను వరంగల్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం ఉదయం వరంగల్‌లోని బట్టలబజార్ సుశీల్ గార్డెన్స్‌లో 15 సంవత్సరాలలోపు పిల్లలకు రాముడు, సీత, హనుమాన్ వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న వారికి సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఉచిత ప్రవేశం ఉంటుందని, మరిన్ని వివరాలకు 72880 11111 నంబర్‌లో సంప్రదించాలని నిర్వాహకుడు బొడ్ల రవీంద్రనాథ్ కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మర్కజీ జంక్షన్‌లో బారికేడ్లు

- ట్రాఫిక్ పోలీసుల తీరుపై విమర్శలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాల జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జంక్షన్‌కు సమీపంలోనే మర్కజీ స్కూల్‌తో పాటు ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్, లష్కర్‌బజార్ బాలికల ఉన్నత పాఠశాల, షైన్ స్కూల్, మిషనరీ సంస్థలకు చెందిన మరో రెండు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు, వాహనదారులతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ జంక్షన్ రద్దీగా ఉంటోంది. కొత్తూరు నుంచి లష్కర్‌బజార్‌కు వెళ్లే దారిలో డివైడర్‌ను సంక్రాంతి సెలవుల్లో మూసివేశారు. సెలవుల అనంతరం గురువారం డివైడర్‌ను తొలగించకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గతంలో కూడా డివైడర్‌ను మూసివేయడంపై పోలీస్ కమిషనర్ దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకెళ్లగా డివైడర్లను తొలగించారు. మళ్లీ తాజాగా డివైడర్లను ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మర్కజీ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ హర్షణీయం

హన్మకొండ: ప్రపంచ జ్ఞాని, భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో స్థాపించి, ఈనెల 19న రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించబోతుండడం హర్షణీయమని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ కొనియాడారు. 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సామాజిక న్యాయ మహా సంకల్పం పేరుతో జాతికి అంకితం చేస్తుండడాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశానికి విగ్రహం ఆదర్శంగా నిలిచిందని, ఇది చరిత్రకమైన నిర్ణయమని పేర్కొన్నారు. ఆయన బాటలో అడుగిడుతున్న ఏపీ సీఎం జగన్‌కు దళితుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

దర్గా ఉర్సుకు ఏర్పాట్లు పూర్తి



నడికూడ : మండలంలోని ముస్త్యాలపల్లి నల్లమటువాగు ఒడ్డున ఉన్న హజ్రత్ సయ్యద్ మదార్ షావలి దర్గా ఉర్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా ముతవల్లి మహ్మద్ ఖాజఖాద్రీ తెలిపారు. శుక్రవారం గంధం తీసుకురావడం, 20వ తేదీన ఉర్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కులమతాలకు అతీతంగా ఎనిమిది దశాబ్దాలుగా ఉర్సు జరుగుతోందని గుర్తుచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచి సుమారు 30వేల మంది భక్తులు ఉర్సుకు హాజరు కానున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం పరకాల జామ మసీదు నుంచి కవ్వాలి, షాషాబ్‌ల విన్యాసాలతో గంధం తీసుకువచ్చే కార్యక్రమంతో ఉర్సు ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హమ్మద్ ముస్తాఫ, ఖాజ, తదితరులు పాల్గొన్నారు.

'టాలెంట్'ను వెలికితీసేందుకే చెకుముకి పోటీలు

ధర్మసాగర్ : విద్యార్థుల్లో దాగివున్న టాలెంట్‌ను వెలికితీసేందుకే చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ధర్మప్రకాశ్ తెలిపారు. జన విజ్ఞాన వేదిక మండల కమిటీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.

సంక్షిప్తంగా

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం



హన్మకొండ అర్బన్: రెడ్‌క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్‌రావు పుట్టినరోజు సందర్భంగా హనుమకొండ జూలైవాడలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, సుధాకర్‌రెడ్డి, హరిప్రసాద్, టీజీఓ నేతలు జగన్మోహన్‌రావు, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ నేతలు హరినాథ్, కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు స్వెటర్ల పంపిణీ

కాజీపేట: కాజీపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై ఒంటరి జీవితం గడుపుతున్న వృద్ధులు, అనాథలకు ఇండో టిబెటియన్ బుద్దిస్ట్ తెలంగాణ అసోసియేషన్ సభ్యులు స్వెటర్లను గురువారం పంపిణీ చేశారు. టిబెట్ అసోసియేషన్ ముఖ్య నాయకుడు టి.దోల్‌మాగ్యల్ ఆధ్వర్యంలో అందజేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



హన్మకొండ: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ) - 327 నాయకులు గురువారం కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, హనుమకొండ జిల్లా కార్యదర్శి ఓదేలు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఖిలా వరంగల్: సంక్రాంతిని పురస్కరించుకుని పడమర కోట జంక్షన్ ప్రాంగణంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఠాకూర్ భవాని అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గజ్జల భావన, మల్లికాంబ, పుట్ట రమ్య, మందాటి సీమ బిందు, రాణి, రమ్య, లావణ్య పాల్గొన్నారు.

దాతలకు అభినందన



హసన్‌పర్తి: చింతగట్టు శివారులోని మహర్షి గోశాలలో ఉన్న గోవుల కోసం, కార్యక్రమాల నిర్వహణ కోసం ఆర్థిక సాయం అందించడానికి ముందుకు వచ్చిన ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ కమిటీ సభ్యులను సన్మానించారు. ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావుతో పాటు కమిటీ సభ్యులు గోశాలను గురువారం సందర్శించారు. కార్యక్రమంలో మహర్షి గోశాల ట్రస్ట్ అధ్యక్షుడు ఎస్.రమేష్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఓసిటీ ఎన్నికల బరిలో 8మంది

కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 19వ డివిజన్ ఓసిటీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన గురువారం ముగిసింది. ఎనిమిది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, అధ్యక్ష పదవికి ఇద్దరు, కోశాధికారికి ముగ్గురు, ప్రధాన కార్యదర్శికి ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రేమ్ స్వరూప్, ఉపేందర్ తెలిపారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండగా, ఎవరైనా ఉపసంహరించుకుంటే ఏకగ్రీవం అవుతాయి. లేకపోతే 21న ఎన్నికలు జరగనున్నాయి.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘాల ప్రతినిధులు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కోరారు. ఈమేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ బీ.వెంకటేశ్వర్ రావును గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిస్కంల గుత్తాధిపత్య విధానాలతో వినియోగదారులకు నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. 2018 - 2019లో నిర్దేశించిన ధరకు మించి అధిక ధరకు కొనుగోలు చేస్తూ, సరఫరా, పంపిణీలో అవినీతి, ఉచిత విద్యుత్‌ను కచ్చితంగా లెక్కించేందుకు మీటర్లు బిగించకపోవడం, బ్యూరో ఆఫ్ స్టాండర్డ్స్ లేని ట్రాన్స్‌ఫార్మర్లు కొనుగోలు చేయడంతో పంపిణీ సంస్థలు నష్టపోతున్నాయని వివరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం -2019 ప్రకారం ఆరు హక్కుల్లో ఒక్కటైనా ఎంపిక చేసుకునే హక్కును విద్యుత్ పంపిణీ రంగంలో కోల్పోతున్నట్లు చెప్పారు. వాటన్నింటిని సరిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల సంఘాల ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, పల్లెపాడు దామోదర్, మొగిలిచర్ల సుదర్శన్, కొంతం వీరాస్వామి, న్యాయవాది వలుపదాసు రాజు, ఆదిశేషు, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఆధార్‌కు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయండి



క్యూలో ఉన్న ప్రజలు

ఖిలా వరంగల్: వరంగల్ హెడ్ పోస్టాఫీసులో ఆధార్ నమోదు, ఆధార్ అప్‌డేషన్ కోసం అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రోజుకు 25 మందికి మించి నిర్వాహకులు అనుమతి ఇవ్వడం లేదని వాపోతున్నారు. రేషన్ షాపుల్లో వేలుముద్రలు పడని వారు ఆధార్ అప్‌డేట్ కోసం వందలాదిగా ఆధార్ కేంద్రాలకు తరలివెళ్తున్నారు. ఈనెల 31తో రేషన్ షాపుల్లో ఈ-కేవైసీ గడువు ముగియనున్న నేపథ్యంలో వినియోగదారుల్లో ఆందోళన మొదలైంది. వరంగల్ హెడ్ పోస్టాఫీసు సూపరింటెండెంట్ స్పందించి ఆధార్ అప్‌డేట్ కోసం అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యాశాఖ ఆర్‌జేడీకి సన్మానం

విద్యారణ్యపురి: హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డిని టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు బాధ్యులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా తమ పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమన్న, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘం కార్యవర్గ సభ్యులు లక్ష్మీప్రసాద్, టీఎస్‌జీఓ పాఠశాల విద్యాశాఖ ఫోరం అధ్యక్షుడు భరత్, కార్యదర్శి రాజేశ్వర్, సిటీ అధ్యక్షుడు ప్రణయ్, కార్యదర్శి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



ఆర్‌జేడీని సన్మానిస్తున్న టీఎస్‌జీఓ బాధ్యులు

'వ్యవసాయ అధికారుల' డైరీ ఆవిష్కరణ



సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

కరీమాబాద్: తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2024వ సంవత్సరానికి సంబంధించిన డైరీ, క్యాలెండర్లను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య గురువారం ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాల్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాకయ్య, రాంనర్సయ్య, కోశాధికారి కృష్ణారెడ్డి, వ్యవసాయ అధికారులు హరిప్రసాద్, బాబు, శ్రీధర్, వీరభద్రం, తన్వి సాగరిక, శ్రీప్రియ, సఫియ, లలిత, ఎన్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని నగరవ్యాప్తంగా టీడీపీ నాయకులు గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. బాలసముద్రం, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఎన్టీఆర్‌నగర్, దర్గా క్రాస్‌రోడ్డులోని బన్ను స్కూల్ (మానసిక వికలాంగ పిల్లల పాఠశాల), కాజీపేట చౌరస్తా, హనుమకొండ రాగన్న దర్వాజ, వరంగల్ ఫోర్ట్‌రోడ్డు రుద్రమాంబనగర్, తదితర ప్రాంతాల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

\- సాక్షి నెట్‌వర్క్